క్లుప్తంగా

విద్యార్థికి ఆర్థిక సహాయం



గుంటూరు మెడికల్: పల్నాడు జిల్లా మాచవరం మండలం, వేమవరం గ్రామం పేద రైతు కుటుంబానికి చెందిన పెరుగు రామ్ ప్రకాష్ అనే అభ్యర్థి ఈ సంవత్సరం జరిగిన నీట్ అండ్ యూజీ పరీక్షలో అఖిలభారత స్థాయిలో 8,822 ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం గుంటూరు అమరావతి రోడ్డులోని ఆలా హాస్పిటల్‌లో హాస్పటల్ అధినేత, ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు విద్యార్థికి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మ్యాట్రిక్స్ విద్యాసంస్థల అధినేత పెరుగు ఏడుకొండలు, మంగా సైదులు, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సంపతి వెంకటేష్ నగదును డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందజేసి విద్యార్థి రామ్‌ప్రకాష్‌ను సత్కరించారు.

దేవదాయ, భజంత్రీ మాన్యం భూములు స్వాధీనం



రెంటచింతల: మండలంలోని దేవదాయ, భజంత్రీ మాన్యం భూములు అన్యాక్రాంతం కాగా మంగళవారం జీ.ఎ.బి శ్రీనివాస్, రెవెన్యూ, పోలీసు అధికారులు స్వాధీనం చేసుకుని స్థానిక ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డికి అప్పగించారు. ట్రిబ్యునల్ కోర్టు ఉత్తర్వులను అనుసరించి సర్వే నంబర్ 426లోని 3.61 ఎకరాల మిట్టగుడిపాడు గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన దేవదాయ, భజంత్రీ మాన్యం భూములను, రెంటాల గ్రామంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానానికి చెందిన సర్వే నంబర్ 646లోని భజంత్రీ మాన్యం 1.16 ఎకరాల భూమిని స్వాధీనం చేసు కుని జిల్లా దేవదాయశాఖ అధికారుల చేతులమీదుగా ఈఓ గాదె రామిరెడ్డి అప్పగించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్(సత్తెనపల్లి) జి. లీలావతి, తహసీల్దార్ దొప్పలపూడి మేరికనకం, ఎస్ఐ సీహెచ్ నాగార్జున, ఈఓలు పూర్ణచంద్రరావు, శివనాగిరెడ్డి, హనుమంతరావు, సైదయ్య, నెమిలిరెడ్డి, సర్వేయర్‌లు కళ్యాణ్, రాజ పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో అయోధ్యస్వామికి పూజలు



పెదకూరపాడు: మండల పరిధిలోని 75 తాళ్లూరు గ్రామంలో అవధూత అయోధ్య స్వామి ఆశ్రమంలో మంగళవారం మాస శివరాత్రి పురస్కరించుకొని వేద పండితులు ఆదిత్య శర్మ ఆధ్వర్యంలో అయోధ్యస్వామి ఉత్సవ విగ్రహానికి, శివలింగానికి గణపతి పూజ, పంచామృత అభిషేకాలు, రుద్రాక్షలు, 20 రకాల పూలతో ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. ఏ గ్రామంలో మాస శివరాత్రి నిర్వహిస్తారో ఆ గ్రామంలో ఆయురారోగ్యాలు, పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతాయని వేద పండితులు ఆదిత్య శర్మ అన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల అందజేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమం కమిటీ నిర్వాహకులు తాటి కోటేశ్వరమ్మ రామకృష్ణ, భారతి వెంకయ్య స్వామి, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రసూన్న



పెదకూరపాడు: ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.ప్రసూన్న సూచించారు. పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, సిజేరియన్లు పూర్తిగా తగ్గించాలన్నారు. కొత్తగా విధుల్లోకి చేరిన గైనకాలజిస్ట్ డాక్టర్ కే సుజాత స్పెషలిస్ట్ సేవలు ప్రజలకు ఉపయోగపడేటట్లు ఆశ వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ విద్య ఉన్నారు.

పన్ను చెల్లించి వడ్డీ మినహాయింపు పొందండి

నరసరావుపేట: పట్టణ పౌరులు ఈనెలాఖరులోగా ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించి వడ్డీ మినహాయింపు పొందాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు మంగళవారం పేర్కొన్నారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

మిరప సాగుపై అనాసక్తి

- ఈ ఏడాది తగ్గనున్న సాగు విస్తీర్ణం
- పెరిగిన పెట్టుబడులు
- ఆశాజనకంగా ధర లేకపోవడం



మిరప పంట సాగు (ఫైల్)

గురజాల: పల్నాడు ప్రాంతం మిర్చి సాగుకు ప్రసిద్ధి. రైతు నష్టంతో సంబంధం లేకుండా ఎంతో కాలంగా ఆనవాయితీగా సాగు చేస్తున్నారు. పత్తి సాగుతో పాటు మిరప సాగు అదే స్థాయిలో ఉంటుంది. కానీ ఈ ఏడాది ఖరీఫ్ సాగులో మాత్రం గురజాల నియోజకవర్గంలో మిరపసాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గత ఏడాది దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో మిరప సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాన వాణిజ్య పంట అయిన మిరప , పత్తి సాగు విస్తీర్ణం క్రమేణా తగ్గుముఖం పడుతున్నాయి.

సాగు విస్తీర్ణం ఇలా..

గురజాల, దాచేపల్లి, పిడుగురాల్ల, మాచవరం, మండలాల్లో మిరప సాగు విస్తీర్ణం 15 వేల హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణంగా ఉంది. కానీ ఈ ఏడాది మిరప సాగు విస్తీర్ణం సగంకు పైగా తగ్గేలా ఉందని ఆయా శాఖ అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభం అవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పెద్దగా ఆశించిన రీతిలో వర్షాలు లేకపోవడం విత్తనాల ధరలు పెరుగుదల మార్కెట్ ఒడిదుడుకులు రైతులను నిరాశ పరుస్తున్నాయి. మిరప సాగు చేసేందుకు పెట్టుబడులు భారీగా ఉంటున్నాయి. ఎకరాకు రూ.40 వేలు నుంచి రూ.50 వేలకు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. దీనికి తోడు చీడ పీడల సమస్య ఆందోళనకు గురిచేస్తోంది.

తగ్గుముఖం దిశగా మిరప సాగు

గతంలో 15 వేల హెక్టార్లలో సాగు చేసే మిరప ఈ ఖరీఫ్ సీజన్ ముగిసే సమయానికి ఈ ఏడాది 6,000 హెక్టార్లుకు మించి మిరప సాగు చేసే పరిస్థితి లేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయంగా కంది పంట సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఇన్ వాయిస్ కన్నా తక్కువ

ఈ సీజన్‌లో రైతులు మిరప పంట అధికంగా సాగు చేస్తారని ఆశించిన డీలర్లు అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టి విత్తనాలు దుకాణాలకు తీసుకొచ్చారు. దీంతో రైతులు అధికంగా కంది పంట వైపు మొగ్గు చూపడం మిరప పంటకు ఆసక్తి లేకపోవడంతో డీలర్లు ఆందోళన చెందుతున్నారు. దీంతో వడ్డీలు పెరుగుతాయనే భయంతో ప్యాకెట్‌కు రూ.50 నుంచి రూ.100 వరకు ఇన్‌వాయిస్ కన్నా తక్కువగా అమ్మకాలు చేస్తున్నట్లు డీలర్లు చెబుతున్నారు.

రైతులు ఆసక్తి చూపడం లేదు...



రైతులు మిరప పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఖరీఫ్ సాగు తక్కువగా నమోదు జరిగే అవకాశం ఉంది. రైతులు పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఆయా వ్యవసాయాధికారులు సలహాలు తీసుకోవాలి. గ్రామాల్లో వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉంటారు.

–శ్రీ కృష్ణదేవరాయలు, పిడుగురాళ్ల వ్యవసాయశాఖ ఏడీఈ

అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఏడీఏ జగదీశ్వర్‌రెడ్డి



రెంటచింతలలోని విత్తన విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ

రెంటచింతల: అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాచర్ల వ్యవసాయ సహాయ సంచాలకులు వి.జగదీశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని పలు విత్తనాల షాపులలో ఆయన ఏఓ కట్టా లక్ష్మారెడ్డితో కలసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డులను, వివిధ రకాల కంపెనీలకు చెందిన విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏపీలో లైసెన్స్ తీసుకోకుండా రైతులకు విత్తనాలను విక్రయించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. షాపు నిర్వహణకు సంబంధించి ప్రతి సంవత్సరం ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. విత్తనాల షాపు నిర్వాహకులు ఎవరైనా అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే వారిపై విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే ఎంఆర్పీకి ఇవ్వాలని సూచించారు. ధరల విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సీజ్ చేస్తామని పేర్కొన్నారు. 25 నుంచి 35 రకాల కంపెనీలకు చెందిన విత్తనాలను పరిశీలించామన్నారు. ఆయన వెంట గ్రామ వ్యవసాయ సహాయకులు గొంటు కృష్ణారెడ్డి, రాంబాబు, సతీష్‌రెడ్డి, వెంకటేష్ ఉన్నారు.

ట్రిపుల్ ఐటీలో పలువురు విద్యార్థులకు సీట్లు



కె.సంపత్‌నాయక్



పి.హారిక



షేక్ షాజియా



గంగహర్షిత



ఎం.సాక్షితారెడ్డి

మాచవరం:మండలం నుంచి నలుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ డి.శ్రీధర్ తెలిపారు. మాచవరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన షేక్ షాజియా(శ్రీకాకుళం), బి.గంగహర్షిత(నూజివీడు), మోర్జంపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎం.సాక్షితారెడ్డి(నూజివీడు), వేమవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని జి.ప్రణతి, నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో సీట్లు సాధించినట్లు పేర్కొన్నారు. సీట్లు సాధించిన విద్యార్థినులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సంపత్‌నాయక్‌కి సీటు..

రెంటచింతల: ట్రిపుల్ ఐటీల్లో మండలంలోని పలువురు విద్యార్థులు సీట్లు సాధించారు. స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి కె.సంపత్‌నాయక్, ఆర్‌కే వల్లి ఇడుపులపాయ కడపలో సీటు సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ మంగళవారం తెలిపారు. మండలంలోని జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన పి.హారిక, ఒంగోలు క్యాంపస్‌లో సీట్ సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య తెలిపారు. ట్రిపుల్ ఐటి సీట్లు సాధించిన సంపత్‌నాయక్, హారికలను ఆయా స్కూల్స్ టీచర్స్, విద్యార్థులు అభినందించారు.

రోటరీ క్లబ్ సేవలు వెలకట్టలేనివి



మారేపల్లి భవ్యశ్రీ, లక్ష్మీకుమారిలను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మాచర్ల: రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యంలో వైభవ్ రెసిడెన్షియల్ ఫంక్షన్ హాల్‌లో రోటరీ 2024–25 కార్యవర్గం అభినందన మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ సభ్యులు యువ వైద్యులు మారేపల్లి భవ్యశ్రీ, ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి, సీనియర్ రొటేరియన్లు డాక్టర్ ఎస్.మురహరిరావు, కన్నెగంటి భాస్కరాచారి, రామా మెడికల్ రామారావును ఘనంగా సన్మానించి అవార్డులు అందజేశారు. రోటరీ క్లబ్ నిర్వహించే అనేక సామాజిక, పర్యావరణ, బాలికల ఆరోగ్య పరిరక్షణ, యువతకు సృజనాత్మక అంశాలపై అభ్యసన, గురుపూజోత్సవ, మహిళా దినోత్సవ కార్యక్రమాలు, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన మహిళలకు చేయూత వంటి అనేక కార్యక్రమాలలు, ప్రభుత్వ పాఠశాలలలో, కళాశాలలో మధ్యాహ్న భోజనానికి అవసరమైనటువంటి వంట సామగ్రి, పరీక్ష సామాగ్రి పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు రోటరీ క్లబ్ సభ్యులు విజయవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మీ, డెప్యూటీ గవర్నర్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య, చైర్మన్ ఇక్కుర్తి శంకర్, ప్రోగ్రామ్ కన్వీనర్ పఠాన్ నాగూర్ వలి తదితరులు పాల్గొన్నారు.

రేపు మాదకద్రవ్యాల వాడవద్దంటూ అవగాహన

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయం మంగళవారం ప్రకటనలో తెలిపింది. గుంటూరు జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి న్యాయవాదులు, పోలీసులు, యువకులు, విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

ఆశ వర్కర్ల నియామకానికి దరఖాస్తులు

మాచవరం: మండలంలో ఆకురాజుపల్లి, మాచవరం, చెన్నాయపాలెం గ్రామాల్లో ఆశ వర్కర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ప్రసాదరావు తెలిపారు. ఈనెల 28 వరకు ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయవచ్చని చెప్పారు. గ్రామ నివాసియై, పదో తరగతి పాసైన వారు, 25 నుంచి 45 మధ్య వయస్సు కలిగి ఉండాలని చెప్పారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

రైతు కూలీ సంఘం నాయకుల డిమాండ్



పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ నిరసన ర్యాలీ

పిడుగురాళ్ల: పోలవర ప్రాజెక్టు ప్రారంభమై ఇరవై ఏళ్లు గడుస్తున్న ఆ ప్రాజెక్టు నిర్వాసితులకు ఇప్పటి వరకు నష్టపరిహారాలు అందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని, నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మధుబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉల్లిగడ్డల నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులలో ఐదు లక్షల మంది పైగా ఉన్నారన్నారు. వారికి ఇప్పటి వరకు నష్ట పరిహారాలు అందక నిరంతరం వరద ప్రమాదాల మధ్య కొట్టుమిట్టాడుతుని వాపోయారు. పునరావాస కాలనీలలో కూలీలుగా మారి నిరాశ నిస్పృహలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి పునరావసం, ఉపాధి లేకుండానే నిర్వాసితులై ఉన్నారనీ చెప్పారు. నిర్వాసితులైన ఆదివాసీలందరికీ చట్టప్రకారం భూమికి భూమి, అడవికి అడవి, సమగ్ర పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

రేపటి నుంచి వారాహి నవరాత్రులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో వేంచేసి యున్న దుర్గామాతని వారాహిదేవిగా అలంకరించి ఈ నెల 26 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు వారాహి నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని పీఠాధిపతి వెలిదండ్ల హన్‌మత్ స్వామిజీ మంగళవారం తెలిపారు. ప్రతి రోజు వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు, తీర్థప్రసాద వితరణ జరుగుతాయన్నారు. జూలై 5న ఆఖరి రోజు భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టనున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పంచముఖీ వేద గాయత్రి ఆలయంలో...

పట్టణంలోని శ్రీశ్రీశ్రీ ఫీరోజి రుషీంద్రుల మఠంలోని పంచముఖీ వేద గాయత్రి అమ్మవారి ఆలయంలో ఈ నెల 26 నుంచి జూలై 4 వరకు వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించబడతాయని వేద గాయత్రి పరివార్ బాధ్యులు మంగళవారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7.30 గంటలకు వారాహి హోమం, సాయంత్రం 6 గంటలకు అర్గళా స్తోత్ర పారాయణం, షోడశోపచార పూజ, అమ్మవారి లీలా వైభవ సత్సంగం జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పీహెచ్‌సీ వైద్యాధికారులు బాధ్యతల స్వీకారం





బెల్లంకొండ: మండలంలోని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నూతనంగా బదిలీపై వచ్చిన వైద్యాధికారులు బాధ్యతలను స్వీకరించారు. గుంటూరు వైద్య కళాశాల నుంచి వచ్చిన డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ దీపిక బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ అనారోగ్య సమస్యలపై వైద్యశాలకు వచ్చిన వారికి సత్వరమే మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం వైద్యశాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

రొంపిచర్ల బస్టాండ్ వరకు బస్సులు నడుపుతాం

- బస్టాండ్ శుభ్రంగా ఉంచుతాం
- బస్టాండ్ సందర్శించిన డీఎం, సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్



రొంపిచర్ల బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీఎం శ్రీనివాసరావు, సిబ్బంది

రొంపిచర్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఎటువంటి వాహనాల పార్కింగ్ ఇతరులు ఆక్రమణలు చేయకుండా చూడాలని ఆర్టీసీ అధికారులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐను కలిసి విన్నవించారు. ఆదివారం సాక్షి దినపత్రికలో బస్టాండేగా..ఆక్రమిస్తే పోలా అంటూ ప్రచురితమైన కథనానికి స్పందించిన డిపో మేనేజర్ బూదాటి శ్రీనివాసరావు బస్టాండ్ సందర్శించారు. ఆ సమయంలో అక్కడ కాంప్లెక్స్‌లో కొన్ని ఆటోలు, స్కూటర్లు నిలబెట్టి ఉండటాన్ని గమనించి వాటి యజమానులను పిలిచి అక్కడి నుంచి తీసివేయించారు.. తాము చేసిన విజ్ఞప్తికి పోలీసులు స్పందించి ఇకపై అక్కడ ఎటువంటి వాహనాలు పార్కింగ్ చేయకుండా చూస్తామని చెప్పినట్లు డీఎం తెలిపారు. అనంతరం బస్సులను అక్కడికి పంపించామన్నారు. ఇకపై ఆ రూట్‌లో తిరిగే బస్సులన్నీ రొంపిచర్ల బస్‌స్టేషన్ వరకు వెళ్లేటట్లుగా ఆదేశాలు ఇచ్చామన్నారు. బస్‌స్టేషన్‌ను ఇకపై శుభ్రంగా ఉంచటం జరుగుతుందని, రొంపిచర్ల ప్రాంత ప్రజలు బస్‌స్టేషన్ ఉపయోగిస్తూ ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం చేయాలని డీఎం సూచించారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే లక్ష్యం

వ్యవసాయాధికారి రామినేని రామారావు



మాట్లాడుతున్న ఏఓ రామారావు

శావల్యాపురం: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తుందని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తలూరు, వేల్పూరు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రామారావు మాట్లాడుతూ రైతులు విత్తన ఎంపిక కొనుగోలు చేయు సమయంలో జాగ్రత్తలు పాటించటంతో పాటు వ్యవసాయ అధికారులు సూచనలు తూచ తప్పకుండా పాటించాలన్నారు. అలాగే ఎరువులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు సంబంధిత దుకాణాదారుడు నుంచి బిల్లు తీసుకోవాలన్నారు. అన్ని రైతుసేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో పురేటి అశోక, ఎంపీవోలు శ్రీనివాసరావు, అనుషా, రైతులు పాల్గొన్నారు.

పంటలకు బీమా చేసుకోవాలి

నరసరావుపేట రూరల్: ప్రీమియంను చెల్లించి రైతులు పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి తెలిపారు. మండలంలోని కేసానుపల్లి, కొత్తపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏఓ శాంతి మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు వేసుకొని భూమిని సారవంతంగా చేసుకోవాలని సూచించారు. ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా మేనేజర్ లింగయ్య మాట్లాడుతూ మిరప, వరి, కంది పంటలను ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో పంటల బీమాను తీసుకోవడం జరిగిందన్నారు. మిరప, కంది పంటలను మండలం యూనిట్‌గా, వరి పంటను గ్రామం యూనిట్‌గా పరిగణిస్తారని తెలిపారు. మిరప ఎకరానికి రూ.360, కంది ఎకరానికి రూ.40, వరి ఎకరానికి రూ.80 ప్రిమియం చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. మిరప, కంది పంటలను ఇన్సూరెన్స్ చేసుకునేందుకు జూలై 31వ తేదీ, వరి ఆగస్ట్ 15వ తేదీ చివరి తేదీలని తెలిపారు.

సంస్మరణ సభను జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నరసరావుపేట: గత మూడు దశాబ్దాలుగా పీడిత ప్రజల హక్కుల కోసం ఉద్యమించిన దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర అధ్యక్షులు ఎన్. క్రాంతికుమార్ (మెషక్) సంస్మరణ సభను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరా రు. ఈ మేరకు మంగళవారం పిలుపునిస్తూ ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు.

రాష్ట్ర సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 17న తీవ్ర అనారోగ్యంతో క్రాంతికుమార్ మృతిచెందటం ప్రజా సంఘాలు, పీడిత ప్రజలకు తీవ్ర లోటని పేర్కొన్నారు. మంగళగిరి డోలాస్‌నగర్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు సంస్మరణ సభ కార్యక్రమాన్ని పీడీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, దీనిలో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. పీడీఎం ఏర్పాటైన తర్వాత జిల్లా కార్యదర్శిగా తన అనారోగ్యాన్ని లెక్కచేయకుండా సంఘం అభివృద్ధిలో కీలకంగా పనిచేశాడని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాసంఘాల నాయకులపై ఎన్ఐఏ వేధింపులకు పాల్పడుతున్న కష్టకాలంలో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టి సంఘాన్ని ముందుకు నడిపించాడని అన్నారు. సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే వైద్యుల బాధ్యత

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి
- యడ్లపాడు పీహెచ్‌సీలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ

యడ్లపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించే దిశగా విధులు నిర్వర్తించడమే వైద్యుల బాధ్యత అని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. మంగళవారం యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సెంట్రల్ ల్యాబోరేటరీ భవనం నిర్మాణ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు. ఆ తరువాత కేంద్రంలో వైద్యం పొందుతున్న రోగులను కలిసి వారికి అందుతున్న ఆరోగ్య సేవలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిధిలో జరుగుతున్న కాన్పుల వివరాలు, చిన్నారులకు ఇస్తున్న వ్యాధి నిరోధక టీకాల పురోగతి, గర్భిణుల కోసం అందిస్తున్న వైద్య సేవలు ఎన్‌సీడీసీడీ సర్వే ప్రగతిపై పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భరద్వాజతో సమీక్షించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల మెరుగుదల కోసం పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్స్‌ను సక్రమంగా అమలు చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో, సర్వేలలో ప్రగతి సాధించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తమై సంక్రమించే వ్యాధుల తీవ్రతను తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సొంత మండలాల్లో బదిలీలకు అవకాశమివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

శావల్యాపురం: గ్రామ సచివాలయ సిబ్బంది సొంత మండలాల్లో బదిలీలకు అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మండల సచివాలయ సిబ్బంది మంగళవారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బందిని హేతుబద్ధీకరణలో భాగంగా ఏ శాఖకు బదిలీ చేస్తారో స్పష్టత ఇచ్చిన తదుపరి బదిలీలు చేయాలన్నారు. సీనియారిటీ జాబితా ఆధారంగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్స్ వెంటనే ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పరంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించే సచివాలయ సిబ్బంది సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఇన్‌చార్జ్‌లు వద్దు, ప్రమోషన్లు ముద్దు అన్నారు. అందరు ఐక్యంగా తహసీల్దారు యం.అర్జున్‌నాయక్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్లకు వినతి పత్రాలు అందజేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ, మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com